# ద్రౌపది

బెంగాలీ మూలం: మహాశ్వేతాదేవి

ఆంగ్లానువాదం: గాయత్రీ చక్రవర్తి స్పైవక్

తెలుగు అనువాదం: 'వ్యోమ'

పేరు: దోపదీ మేఝన్

వయసు: ఇరవై ఏడు

భర్త: దుల్నామఝి (చనిపోయాడు)

ఊరు: చెరఖాన్ బాంక్రాఝర్

బతికుందో చచ్చిపోయిందో చెప్పినా, అరెస్టుకు సాయం చేసినా వంద రూపాయిలు...

** ** **

రెండు ఖాకీ యూనిఫారాలు మాట్లాడుకుంటున్నాయి.

మొదటిది: యేందేంది? దోపదా? యీ అడవి మూకలోవా? వా లిస్టులో యిట్టాంటి పేరే లేదే! అసలు లిస్టులో లేని పేరు ఎవరికైనా వుంటుందా అంట?

రెండోది: దోపది అంటే - ఆ బకూలిలో సూర్జాసాహులేదూ, ఖతం అయ్యాడే, ఆ లోగిట్లో బియ్యం దంపిన యేడే వాళ్ళమ్మ దీన్ని కనింది. సూర్జా సాహు భార్యే పేరు పెట్టిందిలే!

మొదటిది: ఓ.. అని ఇంగిలీషులో చాటబారతాలు రాయడం తప్ప యీ ఆఫీసరులకింకేం రాదు. దీనికింత సోదెందుకని?

రెండోది: కాకలు తీరిన ఆడదోయ్. ఎన్నేళ్ళనీ... ఎన్ని కేసులనీ...

** ** **

ఖాకీచిట్టా: బీర్‌భూమి, బర్ద్వాన్, బంకురా, ముర్షీదాబాద్‌లన్నీ తిరుగుతూ దుల్నా, దోపదీ సేద్యం పనులు చేసుకునేవాళ్ళు. అది 1971. ఘరానా 'ఆపరేషన్ బకూలి' ప్రారంభం. మూడు గ్రామాలనూ ముప్పేట బిగించి మెషీన్‌గన్‌లు గుళ్ళ వర్షం కురిపించాయి. అప్పుడు వీళ్ళిద్దరూ కూడా మట్టికరుచుకున్నారు-చనిపోయినట్టు నటించి! నిజానికి వీళ్ళే అసలు నేరగాళ్ళు. సూర్జా సాహులా, ఆయన కుమారుడి ఖతంలోగానీ, కరువు కాలంలో అగ్రవర్ణాల నూవులు దురాక్రమించడంలో గానీ, ఆ ముగ్గురు కుర్ర కుంకలన్నీ పోలీసులకు పట్టించకపోవడంలో గానీ వీళ్ళే కథానాయకులు. పొద్దున శవాల్ని లెక్కపెట్టేటప్పుడు చూస్తే ఏముందీ? యీ జంట హుష్‌కాకీ! అంతే, 'ఆపరేషన్ బకూలి' బ్రహ్మ కెప్టెన, అర్జున్ సింగ్‌కు వొక్కసారిగా బ్లడ్ షుగర్ పెరిగిపోయింది.ఆదుర్దా, డిప్రెషనూ కలిపి కొడితే డయాబెటీస్ 'పుట్టేస్తుందని మళ్ళీ తెలిసి పోయింది. ఈ ఆదుర్దా, డయాబెటీస్ కుండే డజను మంది మొగుళ్ళలో వొకటి.

దుల్నా, దోపదీ రహస్య జీవితానికి వెళ్ళిపోయారు. చాలా కాలంపాటు, ఆదిమ మానవుడి అంధకార గుహాంతరాళాల్లోకి! ఆ అంధకారాన్ని సాయుధ అన్వేషణతో చీల్చడానికి స్పెషల్ ఫోర్స్ దిగింది. వీళ్ళ దెబ్బకి పశ్చిమ బెంగాల్లోని చాలా జిల్లాల్లో సంతాల్‌లు వాళ్ళ పితృదేవతల దగ్గరికెళ్ళిపోయారు. కానీ ఈ మహా-భారత రాజ్యాంగం ప్రకారం కులమత భావాలకు అతీతంగా సర్వమానవులూ సమానులే. అయినను యిట్టి యుదంతములు యెల్లప్పుడు యెడతెగక జరుగుచునే యుండును. ఇందులకు రెండు రకాల కారణాలు: (1) దాక్కోవడంలో దుల్నా దంపతుల నైపుణ్యం (2) కోతులన్నిటికీ మూతులొక్కటే అన్నట్టు సంతాల్‌లతో సహా యీ ఆస్ట్రో-ఏసియాటిక్ ముండా తెగలన్నీ కూడా చూపులకు స్పెషల్ ఫోర్స్‌కు వొక్కలాగే కనిపించడం.

ఈ ఝర్‌ఖానీ అడివి బాంక్రాఝర్ పోలీసు స్టేషన్ పరిధిలోది (మన ఘనత వహించిన ఇండియాలో చివరికి చీమ అయినా సరే ఏదో వొక పోలీసుస్టేషన్ పరిధిలోనే వుంటుంది కదా) యీ పోగాలను అడివి చుట్టుపక్కల వుండే ప్రత్యక్ష సాక్షుల రికార్డులను వొక చోట చేరిస్తే ఎంత జగ్గజెట్టీకయినా వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి.

పోలీసు స్టేషన్‌లపై దాడి,తుపాకుల స్వాధీనం (వీళ్ళకు పొట్టపొడిస్తే అక్షరం ముక్కరాదు కాబట్టి 'నీ తుపాకీ పారెయ్' అనడానికి బదులు 'నీ కట్టె పారెయ్' అనేస్తుంటారు. ధాన్యపు దళారీల ఖతం, భూస్వాముల ఖతం, వడ్డీ వ్యాపారుల కతం, చట్టం చేసే అధికారుల ఖతం లాంటి ఉపద్రవాలన్నింటిలోనూ యిక్కడి జనాలున్నారు. ఈ లంకాదహనానికి ముందు నల్లతోలు జంట వొకటి పోలీసు సైరన్‌లాగా వూళ పెట్టింది. సంతాల్‌లకు కూడా కొరుకుడు పడని మోటు భాషలో కోలాహలంగా పాడింది.

'సమరాయ్ హిజులెనకోమార్ గోయె కోపె'

'హెందే రంబ్రా కేచే కేచే

పూందీ రంబ్రా కేచే కేచే'

ఏతావాతా దీంతో తేలిందేమిటంటే కెప్టెన్ అర్జున్ సింగ్ డయాబెటీస్‌కి అసలు కారణం యిదేనని.

సాంఖ్య తత్వశాస్త్రంలోని పురుషసూక్తంలాగా, యాంటోనియానీ తొలి సినిమాలలాగా గవర్నమెంటు పద్ధతి కూడా బొత్తిగా అర్థం కాదు. లేకపోతే 'ఆపరేషన్ ఫారెస్ట్ ఝర్‌ఖానీ'కి కూడా మళ్ళీ అర్జున్‌సింగ్‌నే పంపడమేంటి?

ఆవూళ లేస్తూ గంతులేసిన జంట అలనాడు అదృశ్యమైన శవాలేనని ఇంటెలిజెన్స్‌వారు చెప్పడంతో అర్జున్ సింగ్‌కు పై ప్రాణంపైనే పోయింది. దాంతో నల్లతోలు మనుషులంటేనే తారుకోవడం మొదలు పెట్టాడు. గుబ్బ సంచీ తగిలించుకున్న నల్లటి మనిషి ఎవడు కనిపించినా స్పృహ తప్పేనంత పని చేసేవాడు. 'నన్ను చంపేస్తున్నారు నాయనో' అని పెడబొబ్బలు పెట్టడం, గటాగటా నీళ్ళు తాగడం, లొడాలొడా నీరుడు వొదలడం - యిదీ తీరు! యూనిఫామ్‌గానీ, వేదాంతం గానీ యీ డిప్రెషన్‌కు ఉపశమనం యివ్వలేకపోయాయి. యేమయితేనేం ఎట్టకేలకు స్వచ్ఛంద పదవీ విరమణ సాకుతో శ్రీశ్రీశ్రీ సేనానాయక్‌గారి సమక్షంలో హాజరు కాగలిగాడు. సేనానాయక్‌లవారు అంటే - అతివాద వామపక్ష రాజకీయాలను ఎదుర్కోవడంలో ముదరముగ్గిన బెంగాలీ స్పెషలిస్టు.

ప్రత్యర్థి వర్గీయుల కార్యకలాపాలూ, శక్తి సామర్థ్యాలూ వాళ్ళ కంటే బాగా సేనానాయక్‌కే తెలుస్తాయి. అందుకే ముందస్తుగా అర్జున్ సింగ్ ముందు సిక్కుల సైనిక మేధాసంపత్తి (?)కి వొక కితాబు పడేస్తాడు. తర్వాత దానికి యిలా వివరణ యిస్తాడు. "తుపాకీ గొట్టం కొనతో అధికారాన్ని అందుకునే ఏకైక ప్రత్యర్థి వర్గం అదేనా? అయితే అర్జున్ సింగ్ అధికారం కూడా తుపాకీ శిశ్నం ద్వారానే పేలిపోతుంది. వహ్వా! తుపాకీ లేకపోతే యీ రోజుల్లో 'పంచక కారాలు' కూడా దమ్మిడీకి కొరగావు. హహ్హా..." యెక్కడైనా యెంతమందున్నా యిదే రకం నుపన్యాసాలు దంచుతాడు. ఈ ఉపన్యాసాల మహిమతో సైనిక శక్తులకు ఆర్మీహాండ్ బుక్‌మీద మళ్ళీ విశ్వాసం లేచి వస్తుంది. అది సామాన్యమైన బుక్ కాదు. నాటుమోటు ఆయుధాలతో అలగాజనం చేసే పోరాటాన్ని అతి పనికిమాలిన దొంగ వ్యవహారమని అది ఉద్ఘోషిస్తుంది. యిలాంటి వాళ్ళు కనిపించిన వెంటనే కాల్చివేయడం ప్రతి సైనికుడి పవిత్ర కర్తవ్యం. విల్లంబులూ, బరిసెలూ, గొడ్డళ్ళతో మనుషుల్ని చంపేసే దోపదీ, దుల్నా కూడా యీ లెక్కలోకే వస్తారు. నిజానికి 'అన్నల' కంటే వీళ్ళకే పోరాటపటిమ యెక్కువ. 'గొట్టాలు' పేల్చడంలో అన్నలందరూ ఏమంత ఆరితేరిన వాళ్ళు కాదు. ఆకారపుష్టిగా తుపాకులేసుకుని తిరుగుతుంటే దానంతటికి అదే అధికారం వచ్చి పడిపోతుందనుకునే రకం. కానీ పొట్టపొడిస్తే అక్షరం ముక్కరాని యీ దుల్నా, దోపదీ వున్నారే వీళ్ళు అలా కాదు, ఆయుధాలను ప్రయోగించడం అనేది తరతరాలుగా వారికి అంది వచ్చిన నైపుణ్యం.

ఇక సేనానాయక్ పద్ధతులు చూడ్డానికి అలిష్టిగా అనిపించినా అంత అల్లాటప్పా మనిషేం కాదని యిక్కడ చెప్పాలి. ఆయన చేష్టలు యేమైనా గానీ 'సిద్ధాంతరం' దగ్గరి కొచ్చేసరికి ప్రత్యర్థులను ఆయన గౌరవిస్తాడు. ఇది దూకుడుగా ఆడే తుపాకుల సయ్యాటే అనుకుంటే మాత్రం ప్రత్యర్థులను మనం అర్థమూ చేసుకోలేము. అణిచెయ్యనూ లేము. శత్రువును మట్టుబెట్టాలనుకుంటే ముందు వొక్కటైపో. అలా వారిలో వొకడై ( సిద్ధాంతపరంగా)



పోవడం ద్వారావే ఆయన వారిని అర్థం చేసుకుంటాడు. భవిష్యత్తులో దీవ్నంతా గ్రంథస్తం చెయ్యాలని ఆయన తలపోస్తూ వుంటాడు. అచ్చంగా మట్టిలో పొర్లాడి పరిశ్రమించే వాళ్ళ సందేశాన్ని ఆ గ్రంథంలో ఆకాశానికెత్తి పట్టడానికీ, అన్నలను పాతాళానికి తొక్కెయ్యడానికీ కూడా ఆయన నిర్ణయించేసుకున్నాడు. ఈ ఆలోచవా ధోరణి అంతా చూడ్డానికి చాలా సంక్లిష్టంగా అనిపిస్తున్నా నిజానికి ఆయన చాలా సింపుల్‌గా వుంటాడు. తాబేలు మాంసం తిన్నాక వాళ్ళ మూడో 'ఘరానా పెదవాన్న' వుండేటంత సంతృప్తిగానూ వుంటాడు. ఏదో పాత ఫిలిమ్ పాటలో అన్నట్టు 'చుట్టుచుట్టుకూ మారుతుంది. ప్రపంచం కొత్త కొత్తగా' అనేది కూడా ఆయనకు తెలుసు. అలా ప్రపంచం మారినప్పుడల్లా యింతే గౌరవ ప్రదంగా తాను జీవించాలనుకుంటే దానికి తగిన అర్హతలు తప్పని సరి. అప్పుడు అవసరమైతే తానెంతమటుకు మార్పులను సరిగ్గా అర్థం చేసుకుంటాడోకూడా చూపించగలడు. యిప్పుడు తాను చేసేది మాత్రం అప్పుడు ఎవరికీ గుర్తుండదని అతడికి బాగా తెలుసు. కాలంతోపాటు తానూ రంగు మారుస్తూ వస్తే చివరికి తాను మనిషిగానే మిగిలి వుంటాడా అన్న విషయం – సందేహాస్పదమేననేది కూడా ఆయనకు తెలుసు. ఈనాడు అతడు అణిచీ, అంతం చేసీ యువకులను వదిలించుకుంటున్నాడు. రక్తపాతం వేర్వే పాఠాలనూ, జ్ఞాపకాలనూ జనాలు చాలా తొందరగా మరిచిపోతారని ఆయనకు తెలుసు. అయితే యింకో పక్క యీ ప్రపంచ వారసత్వాన్ని యువకుల చేతికి అప్పగించాలని షేక్స్‌పియర్ తరహాలో విశ్వసిస్తూ వుంటాడు. అతడు టెంపెస్ట్ నాటకంలోని ప్రాస్పెరో లాంటివాడు.

ఏమయితేనేం, అందాల్సిన సమాచారం అందింది. ఎంతోమంది వయసులో వున్న ఆడా మగా గుంపులు గుంపులుగానూ, జీపుల్లోనూ వచ్చి వొక పోలీసు స్టేషను తర్వాత యింకో పోలీసు స్టేషనుపై పడి గడగడలాడించి, ఆ ప్రాంతాన్ని వొక వూపు వూపి ఝుర్‌ఖానీ అడివిలోకి అదృశ్యమైపోయారని సమాచారం అందింది.

బకూలి నుంచి తప్పించుకున్న తర్వాత దోపదీ, దుల్నా ప్రతి భూస్వామి యింట్లోనూ 'పని'చేశారు. హంతకులకు వాళ్ళ లక్ష్యాల గురించిన సమాచారాన్ని వీళ్ళు చాకచక్యంగా అందించగలిగేవాళ్ళు. తాము కూడా కొద్దో గొప్పో 'సైనికు'లమేనని కొంచెం గర్వంగా చెప్పకునే వాళ్ళు. చివరికి నిజమైన సైనికులతోనే దుర్భేద్యమైన ఝుర్‌ఖానీ అడివి ముట్టడించబడింది. సైన్యం దిగి యుద్ధరంగాన్ని కోవలుగా కోసింది. తాగునీటికి వొకేవొక దిక్కు అయిన చెలమలనూ జలపాతాలనూ సైనికులు మాటువేసి కాపుగాస్తున్నారు. విసుగు లేకుండా, రెప్పలు ఆర్పకుండా కాపుగాస్తున్నారు. ఆ విధంగా సాగుతున్న గాలింపులో – సైన్యం ఇన్‌ఫార్మర్ దుక్కీరామ్ ఘరారీ కనుబొమ్మలు ముడుచుకున్నాయి. పరుపు రాయి మీద బోర్ల పడుకుని తల ముంచి నీళ్ళు తాగుతున్న వొక సంతాల్ యువకుడు దుక్కీరామ్ కంట్లోపడ్డాడు. ఆ పడుకున్నవాణ్ణి పడుకున్నట్టు కాల్చేశారు సైనికులు. .303 ( పాయింట్ త్రీనాట్ త్రీ) కింద జటాయువులాగా కూలిపోయి, వెచ్చటి నురుగు నిండిన నోటితో 'మా–హో' అని వొక గర్జారావం చేసి ఆ సంతాల్ యువకుడు చేష్టలుడిగిపోయాడు. తర్వాత తెలిసింది – అతడే శత్రుభయంకరుడైన దుల్నా మఝి అని.


మా–హో అంటే ఏమిటర్థం? గిరిజనుల భాషలో అదేమైనా హింసాత్మక నినాదమా? ఎంత జుట్టు పీక్కున్నా రక్షణ విభాగానికి రవ్వంత కూడా తెలీలేదు. దీనికోసం కలకత్తా నుంచి వాయుమార్గాన ఇద్దరు ట్రైబల్ స్పెషలిస్టులు దిగారు. హాఫ్‌మన్ జెఫర్, గోల్డెన్ పామర్ లాంటి ఉద్దండుల నిఘంటువులను ముందేసుకుని వాటి మీద చెమటల్లు కక్కారు. కొసాకి సర్వజ్ఞులైన సేనానాయక్‌గారు చమ్రూను రావించారు. చమ్రూ రావడం రావడమే ఆ యిద్దరు స్పెషలిస్టులను చూసి యికిలించాడు. బీడీతో చెవిగోక్కుని ఇట్లా చెప్పాడు.

"గాంధీ మారాజుగోరి కాలంనాడు సావుకు సై అన్న మాల్దా సంతాళ్ళు ఆ కేక పెట్టేవో ళ్ళండి! అది పోట్లాటలో పాలికేకండి. ఇంతకీ మాహో అన్నదెవడండీ యీడ? మాల్దా నుంచి యెవడన్నా దిగేడేంటి?"

అలా చిక్కుముడి విడిపోయింది.

దుల్నా శవాన్ని బండ మీదే వొదిలిపెట్టి సైనికులు మళ్ళీ చెట్లెక్కిపోయి కొమ్మల వెనకా, ఆకుల నడుమా కనుమరుగైపోయారు. మనిషి తలా మేక శరీరం వుండే గ్రీకు పాన్ దేవ తలు అసంఖ్యాకంగా ఆ కొమ్మలను కరుచుకుని కాపుగాస్తున్నట్టున్నారు. ఎర్ర గండుచీమలు చాటుమాటు చోట్లలో కుట్టి వాళ్ళను పీకిపెడుతున్నాయి. ఈ విధంగా శవం కోసం వచ్చే మనుషులను మట్టుబెట్టడానికి మాటుగాస్తున్నారు.

ఇదంతా వేటగాళ్ళ పద్ధతేగాని సైనికులది కాదు. పాత పద్ధతుల్లో యీ పశువులను మలెయ్యడం కుదరని పని అని సేనానాయక్‌కు తెలుసు. అందుకే శవాన్ని ఎర వేసి 'చేప'ను పట్టాలని తన మనుషులకు చెప్పాడు. 'అంతా వొక కొలిక్కి వస్తుంది. దోపది పాటకి వేను తాళం వేసేసినట్టే' అన్నాడు. ఆయన ఆజ్ఞలకు అనుగుణంగానే వెళ్తున్నారు సైనికులు. అయినా శవం కోసం యెవరూ వొస్తున్న జాడ లేదు. రాత్రి వొకసారి సైనికులు కంగారుగా



కాల్పులు జరిపేసి కిందకు దిగొచ్చి చూశారు. యెండుటాకుల మీద జతకడుతున్న రెండు ముళ్ళపందులు నిర్జీవంగా కనిపించాయి.

ఈలోగా రాత బాలేక – దుల్నాను పట్టించినందుకు బహుమతి అందుకోకముందే ఇన్ ఫార్మర్ దుక్కీరామ్‌కు వొక బాకు లభించింది, తన కంఠంలో దిగబడి!

దుల్నా శవాన్ని దులుపుకోలేకా, పీకి పెడుతున్న చీమలతో వేగలేకా ఆ కొమ్మలపై సైని కులు చచ్చే చావు చస్తున్నారు.

'ది డిఫ్యాటీ'ని తిరగేస్తూ వున్నాడు సేనానాయక్. అదొక ఫాసిస్టు వ్యతిరేక పుస్తకం. శవం కోసం యెవరూ రాలేదని వినగానే ఆ పుస్తకాన్ని చాచికొట్టి 'ఆ' అని అరిచాడు. అప్పుడే అంతే ఆవేశంతో 'హెందే రంబ్రా' అని అరుచుకుంటూ పట్టలేని ఆనందంతో ట్రైబల్ స్పెషలిస్టులలో వొకడు అక్కడికి దూసుకొచ్చాడు. వొంటి మీద బట్టలు వుండీలేనట్టుగా – మనిషి ఆర్కిమెడీసు బాపతులో వున్నాడు. 'లేనండి సార్, ఆ హెందే రంబ్రా కీలకం కనిపెట్టేశాను. అది ముండారీ భాష' అని గస పోసుకున్నాడు.

అలా దోపది వేట సాగుతోంది. ఝుర్‌ఖానీ అరణ్యపర్యంకం మీద ఆ వేట సాగుతోంది. అది అలా సాగుతూనే వుంటుంది. ఎందుకంటే అది ప్రభుత్వం పృష్ఠభాగాన్ని తొలుస్తున్న పుట్టకురుపు. ఏ మూలికలకీ అది మానబోదు, యే లేపనాలకీ అది పగలబోదు.

తొలి రోజుల్లో అయితే యీ చీకటోళ్ళు అడివి అనుపానులు తెలీక వూరికే పట్టు బడిపోతుండేవాళ్ళు. భూస్వాముల రూపాయలే పోలీసు తూటాలుగా మారి వాళ్ళను బలి తీసుకునేవి. ఘనమైన యుద్ధనీతి! ఈ యుద్ధనీతి కిందే ఆ కళేబరాల ఖర్మం కాలిపోయేది. కుక్కలూ, నక్కలూ, కాకులూ, గద్దలూ, జంగుపిల్లులూ, దూలగొండ్లూ, చీమలూ, పురుగులూ బిలబిలమనేవి. కడుపులూ, పేగులూ, కనుగుడ్లూ, గుండెకాయలూ, మూలగలూ, మర్మావయవాలూ ఫలారమైపోయేవి. ఇంకా మిగులుదూ నగులుదూ వుంటే అవి ఆ కట్టె కంకాళాలతోటే కైంకర్యమైపోయేవి.

అయితే తరువాయి దశలో వాళ్ళు బయలు పోరులో దుర్లభం అయిపోయారు. చూడ బోతే ఈసారి వాళ్ళకెవరో యమపురి జిత్తులాంటి కొరియర్ దొరికినట్టే వుంది. సర్వం సహా ఆమే దోపది! ఆమె దుల్నాను వెచ్చటికి మించిన వెనరుతో కోరుకుంది. సందేహమెం దుకు; ఇప్పుడు చీకటోళ్ళను కాపాడేది ఆమే.

'చీకటోళ్ళు' – అనేది కూడా వొక వూహాగానమే.

ఎందుకనీ?

అసలు వెళ్ళింది యెందరు?

మౌనమే సమాధానం. దీని మీద ఎన్నో కతలు! అచ్చులో ఎన్నెన్నో పుస్తకాలు! దేన్నీ నమ్మకపోవడమే ఉత్తమం.

ఆరేళ్ల పోరులో చనిపోయింది యెందరు?

మౌనమే సమాధానం.

పోరాటాల తర్వాత – చితికిపోయిన, విడిపోయిన చేతుల కంకాళాలు బయల్పడేవి – యెందుకు? (అసలు చేతులు లేని మనుషులు పోరాడగలరా?) మెడ ఎముకలు వూగులాడుతూ వుండేవి – యెందుకు? కాళ్ళూ, పక్కటెముకలూ నుగ్గయిపోయి వుండేవి – యెందుకు?

సమాధానం రెండు రకాలు.

ఒకటి మూసుకుని వుండడం. రెండు, కడుపు చించుకోవడం. సిగ్గా, శరమా? ఇంతదాకా తెచ్చారు, ఎందుకు? ఏం చెయ్యడానికి?...

అడివిని ముట్టడించింది యెందరు?

మౌనమే సమాధానం.

ఒక అక్షౌహిణి? ఈ ఘోరాటవిలో అంత పెద్ద బెటాలియన్‌ను జనం డబ్బుతో పోషించడం అనేది వ్యాయమా?

ఒక అభ్యంతరం. ఘోరాటవి అనడం సరికాదు. ఆ బెటాలియన్‌కు అద్భుతమైన ఆహారం సప్లైలున్నాయి. మతాలవారీగా మొక్కులకు ఏర్పాట్లున్నాయి. వివిధభారతి వినే వీలూ, యే హై జిందగీ ఫిలిమ్‌లో సంజీవ్ కుమార్‌నీ శ్రీకృష్ణపరమాత్మనీ ముఖాముఖీ చూసే సదుపా యాలూ వున్నాయి. నో. ఈ ప్రాంతం ఘోరమైంది కాదు.

ఎందరున్నారు?

మౌనమే సమాధానం.

ఎందరున్నారు? కనీసం ఒక్కరైనా వున్నారా?

దీని సమాధానం చేంతాడంత.

ఇక వ్యవహారం: కార్యకలాపాలు భేషుగ్గా సాగిపోతున్నాయి. వడ్డీ వ్యాపారులూ, భూస్వాములూ, ధాన్యం దళారీలూ, వూరూ పేరు లేని వేశ్యాగృహ నిర్వాహకులూ, మాజీ ఇన్‌ఫార్మర్లూ గడగడ వొణికిపోతున్నారు. ఆకలిగొన్న అనాచ్ఛాదితులు ఇంకా బలోపేతంగా వున్నారు. దారికి రావడం లేదు. కొన్నిచోట్ల అయితే వ్యవసాయ కూలీలు మంచి కూలీలే గిట్టుబాటు చేసుకుంటున్నారు. చీకటోళ్ళకు సామభూతి తెలిపే గ్రామాలు ఇంకా నివురుగప్పే వున్నాయి. ఆశ్చర్యం ఇస్తూనే వున్నాయి. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే ఎవరికైనా...

ఇంతకీ యీ దృశ్యం అంతట్లోనూ దోపది యెక్కడుంటుంది? చీకటోళ్ళతో ఆమె తప్పకుండా సంబంధాలు పెట్టుకునే వుంటుంది. అయితే భయానికంతా కారణం మరోచోట వుంది. ఈ శత్రుశేషం చాలాకాలంగా ఈ అనాగరికపు అడివి మాలోకంలో బతుకుతూ వున్నారు. గిరిజనులతోనూ, బడుగు వ్యవసాయ కూలీలతోనూ వాళ్ళు పెనవేసుకుపోయారు. వాళ్ళు తప్పకుండా యీపాటికి పుస్తక పరిజ్ఞానం కోల్పోయే వుంటారు. బహుశా దాన్ని వాళ్ళు తమకు బతుకు నిచ్చిన మట్టిని పదును చేయడానికి వుపయోగించి వుంటారు. కొత్త పోరాటాలకూ, ఆత్మ రక్షణ పద్ధతులకూ ధారవోసి వుంటారు. బాహ్య పుస్తక పరిజ్ఞానమూ, కపటమెరుగని సహజోత్సాహమూ మాత్రమే వున్న వాళ్ళనయితే వొదుల్చుకోవడం, కాల్చిపారేయడం ఎవడికైనా తెలికే. కానీ కుదుళ్ళకంటా వెళ్ళి పనిచేసే వాళ్ళను ఏరేయడం మాత్రం అంత సులభం కాదు.

అందువలన 'ఆపరేషన్ ఘర్‌ఖానీ ఫారెస్ట్' ఆగిపోదు. కారణం: ఆర్మీ హాండ్ బుక్‌లోని హెచ్చరికలు!

దోపదీ మేఝిన్‌ను పట్టండి. మిగతా వాళ్ళ దగ్గరకు అదే తీసుకుపోతుంది.

కొంచెం అన్నం మొలకు కట్టుకుని దోపది నిదానంగా నడుస్తోంది. ముషాయితుడూ భార్య వండి పెట్టింది. ఆమెకది మామూలు. అన్నం చల్లబరిచి ఆ మూటను దోపది నడుముకు కట్టుకుంటుంది. నడిచేటప్పుడు తల్లో పేలు కుక్కుకుంటూ నడుస్తుంది. కొంచెం కిరసనాయిలు వుంటే మాడుకు రుద్దుకుని పేలు వొదిలించుకోవచ్చు. ఆనక సోడా వుప్పతో తలంటు పోసుకోవచ్చు. కానీ అంత యిది ఎక్కడిదీ? లంజా కొడుకులు చెలమచెలమా మలుపు మలుపూ మాటు వేసుంటే! నీళ్ళలో యెక్కడైనా రవ్వంత కిరసనాయిలు వాసన పసిగట్టారా, ఇంక దాని వెంబడే వచ్చేస్తారు.

దోపదీ!

ఆమె పట్టించుకోలేదు. సొంత పేరు ఎప్పుడు చెవిన పడినా ఆమె యెప్పుడూ పట్టించుకోదు. తన పేరు మీద బహుమతి ప్రకటనను పంచాయతి ఆఫీసులో ఆమె యివాళే చూసింది.

* * *

ఏం చూస్తున్నావ్? దోపదీ మేఝిన్ ఎవరు? పట్టిస్తే డబ్బులా? అని ముషాయ్‌తుడూ భార్య అడిగింది.

ఎంతేమిటి?

– వంద

అమ్మో! ఈసారేమిటో ముమ్మరంగా వుంది. ఖాకీలన్నీ కొత్త మొహాలే అంది ముషాయ్ భార్య.

హు...

– మళ్ళీ రావొద్దు

– యేం?

ముషాయ్ భార్య వేల చూపులు చూపింది. సాహిబ్‌గాడు మళ్ళ వొచ్చివాడని తుడూ అంటున్నాడు. ఒకవేళ వాళ్ళు నిన్ను పట్టుకుంటే మా పల్లే...మా పాకలూ...

– మళ్ళీ తగలబెడతారు


– అవునూ, మరి దుక్కీరామ్...

– సాహిబ్‌గాడికి తెలిసిపోయింది?

– షోమాయ్, బుధ్నా నమ్మకద్రోహం చేశారు.

– వాళ్ళెక్కడ?

– రైలెక్కి పారిపోయారు.




దోపది ఏదో పసిగట్టింది. నువ్వు ఇంటికెళ్ళు అంది.

'నేనెవర్నో తెలీకపోతే, నన్ను పట్టుకున్నంత మాత్రాన ఏమవుతుంది?' అనుకుంది.

– "నువ్వు పారిపోలేవా?"

"ఊహూ...ఎన్నిసార్లని పారిపోను చెప్పు? నిన్ను పట్టుకుంటే యేం చేస్తారు వాళ్ళు? ఎన్‌కౌంటర్ చేస్తారు. చెయ్యనీ."

"మాకైతే ఇంకో దారి లేదుకదా" అంది ముషాయ్ భార్య.

దోపది మెల్లగా అంది–'నేను ఎవరిపేరూ చెప్పను.'

చిత్రహింసలతో ఎవరైనా ఎలా దారికొస్తారో దోపదికి తెలుసు. చాలాసార్లు వింది. చిత్రహింసలవల్ల బలమూ బుద్ధీ చెదిరిపోతే దోపది నాలిక కటుక్కున కొరికిపారేసుకుంటుంది. ఆ కుర్రాడు చేసిందట్లాగే. వాళ్ళు అతన్ని ఎన్ కౌంటర్ చేశారు. నిన్ను ఎన్ కౌంటర్ చేసేటప్పుడు పెడ రెక్కలు విరిచి కట్టేస్తారు. నీ ఎముకలన్నీ నుగ్గు. నీ సెక్స్‌–ఒక భీకరమైన గాయం. ఆ తర్వాత ఏముందీ...ఎన్‌కౌంటర్‌లో ఒకరి హతం...

గుర్తుతెలియని పురుషుడు...

వయసు ఇరవై రెండేళ్ళు...

ఇలా ఆలోచించుకుంటూ నడుస్తూ దోపదీ! అని ఎవరో పిలవడం వింది.

* * *

ఆమె ఉలకలేదు పలకలేదు. సొంత పేరెత్తితే ఆమె బదులు పలకదు. ఇక్కడ ఆమె పేరు ఉపీ మేఝిన్. కానీ, ఎవరా పిలిచేది?

ఆమె ఆలోచనల్లో కంటకావృతమైన శంకాతలం వొకటి యెల్లవేళలా దాగి వుంటుంది. దోపదీ! అని వినీ విననావే ఆ కంటకాలన్నీ నిక్కబొడుచుకున్నాయి–వొక ముళ్ళ పందికి లాగా. నడుస్తూనే తనకు తెలిసిన ముఖాల ఫిలిమ్‌ని విప్పదీసింది. ఎవరు? షోమ్రా...కాదు. అతను పరారీలో వున్నాడు. షోమాయ్, బుధ్నా కూడా మరొకందుకు పరారీలో వున్నారు. గోలోక్! కాదు; అతను 'బకూలి'లో వున్నాడు. ఆ బకూలి నుంచే ఎవరైనానా? 'బకూలి' తర్వాత తన పేరు ఉపీమేఝిన్, దుల్నాపేరు మాతంగ్ మేఝి. ముషాయ్‌కీ అతని భార్యకీ తప్ప ఇక్కడ ఎవరికీ తమ అసలు పేర్లు తెలీవు. 'అన్న'లకయినా ఇదివరకటి బ్యాచ్ వాళ్ళెవరికీ తెలీదు.

* * *

అది కష్టకాలం. తలుచుకుంటేనే అంతా అయోమయంగా వుంటుంది దోపదికి.

బకూలిలో 'ఆపరేషన్ బకూలి'

తన రెండిళ్ళ లోగిలిలో మూడు బావులూ, రెండు గొట్టబ్బావులూ తవ్వడానికి బిడ్డిబాబుతో యేర్పాట్లు చేసుకున్నాడు సూర్జాసాహు. ఎక్కడా నీళ్ళు లేవు. బీర్‌భూమి అంతా కరువు. సూర్జాసాహు ఇంట్లో మాత్రం మునిగినన్ని నీళ్ళు, కాకి కన్నంత స్వచ్ఛమైన నీళ్ళు.

"అన్నీ మండిపోతున్నాయి. కాలవ శిస్తు గట్టి నీళ్ళు తెచ్చుకోండి. అసలు మీరు కట్టే శిస్తుతో వ్యవసాయాన్ని పెంచితే నాకొచ్చే లాభమేంటి? ఈ రోజుల్లో ఏది చూసినా మండిపోతావుంది. ఇక దొబ్బండెహే! మీ పంచాయతీ సరే నా గోచీ సరే. నా నీళ్ళతో అంతంత పంట పండించడం, పాలికి అని జెప్పి సగం పంట దొబ్బడం. తేరగా తిని బొక్కా నా కొడుక్కి ముద్దిమీద గుడ్డ నిలవడం లేదు. అన్నీ అయినాక ఇంటికాడ నా వొడ్లో...నా

డబ్బులో...మీకు మంచి చెయ్యాలనుకున్నందుకు నాకు తగిన శాస్తే జరిగింది!

– మంచా? ఏం జేశారు మీరు?

– ఊరికి నీళ్ళియ్యలేదా?

– ఆ నీళ్ళూ, నీ చుట్టం భగువాల్‌కి ఇచ్చుకున్నావ్.

– మీకు రావడం లేదా?

– లేదు. అంటరాని వాళ్ళకు నీళ్ళు అందవు.

దాంతో పోట్లాట ప్రారంభమైంది. మానవుడి సహనాన్ని కరువు మింగేస్తుంది. ఊళ్ళో కుర్రాళ్ళు సతీష్, జుగల్, యింకొక కుర్రాడూ – రాణాయేనా అతని పేరు? – కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశారు. 'వాడు బొట్టు రాల్చడు. వాణ్ణి మట్టుపెట్టండి.'

రాత్రికి రాత్రి సూర్జా సాహు ఇల్లు ముట్టడి అయింది. సూర్జా సాహు తుపాకి బయటికి తీశాడు. అయినా పాపం! అతడు ఒక పలువుతాడుకు బందీ అయ్యాడు. అతని తెల్లగుడ్లు గింగిరాలు తిరిగాయి. మాటి మాటికీ స్వాధీనం తప్పిపోతున్నాడు.

"అన్నలారా, మొదటి దెబ్బ నాది. మా ముత్తాత ఎప్పుడో వీడి దగ్గర వొక పడి ధాన్యం తీసుకున్నాట్ట. ఆ బాకీ తీర్చడానికి వీడికి యిప్పటికీ నేను వెట్టి చేస్తున్నా" అన్నాడు దుల్నా.

"వీడికి నన్ను చూస్తే చాలు, చొంగ కారుతుంది. వీడి కళ్ళు పీకేస్తాను" అంది దోపది.

సూర్జాసాహు! షియూరి నుంచి టెలిగ్రామ్. ఒక స్పెషల్ ట్రెయిన్. ఆర్మీ. బకూలి దాకా జీపు అసాధ్యం. మార్చ్– మార్చ్–మార్చ్. బూట్ల నాడాల కింద కంకర కర్–కర్–కర్. సైన్యం బార్లు. మైకుల్లో ఆదేశాలు. సతీష్ మండల్, జుగల్ మండల్, రాణా అలియాస్ ప్రవీర్ అలియాస్ దీపక్, దుల్నా మఝి, దోపదీ మేఝున్ లొంగిపొండి – లొంగిపొండి – లొంగిపొండి. లేదు లొంగేది లేదు – లొంగేది లేదు. ఊళ్ళో నుంచి రివ్వు–రివ్వు–రివ్వు. జవాబుగా ధన్–ధనా–ధన్. గాల్లో పొగలేని వాసన. ధన్–ధన్ విరామమే లేని ధనా–ధన్. మంట. బకూలి తగలబడుతోంది. ఆడామగా, పిల్లా పాపా... మంటలు – మంటలు. కాలవ బాట కమ్మెయ్. రాత్రికి రాత్రే స్వాహా... స్వాహా. దోపదీ, దుల్నా పాక్కుంటూ వెళ్ళిపోయారు క్షేమంగా.


బకూలి నుంచి వాళ్ళు పాల్తాకురి చేరుకోలేకపోయారు. భూపతి, తాపా వాళ్ళను చేరదీసుకున్నారు. అప్పుడే ఝుర్‌ఖానీ అడివి ప్రాంతంలో దోపదీ, దుల్నా పనిచెయ్యాలని నిర్ణయించబడింది.

"పిల్లా, ఇదే ఉత్తమం. ఈ దోవన మనకిక కుటుంబమూ, పిల్లలూ వుండరు. ఎవడికి తెలుసు? ఒకనాటికి ఈ భూస్వాములూ, వడ్డీ వ్యాపారులూ, పోలీసులూ తుడిచిపెట్టుకు పోవచ్చు" అని దుల్నా ఒక రోజు దోపదితో అన్నాడు.

* * *

ఎవరివ్వాళ వెనక నుంచి ఆమెను పిలిచింది?

దోపది నడక ఆపలేదు. పల్లెలూ, పొలాలూ, రాయీ రప్పా – పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంటు మార్కర్లు – వెళ్ళిపోతున్నాయి. వెనక పరుగెత్తే అడుగుల చప్పుడు. ఒకేవొకడు పరుగెత్తుతున్నాడు. ఝుర్‌ఖానీ అడివి యింకా రెండు మైళ్ళుంది. అడివిలోకి చొరబడడం తప్ప ఆమె యింకేం ఆలోచించడం లేదు.




తన కోసం మళ్ళీ పోలీసులు నోటీసులు పెట్టిన విషయం తనవాళ్ళు తెలుసుకునేట్టు చేయాలి. మళ్ళీ ఆ సాహిబ్ లంజాకొడుకు దిగాడని వాళ్ళకు చెప్పాలి. స్థావరాలు మార్చెయ్యాలి. సండారాలో కూలి సమస్య మీద లక్ష్మీబేరా, నరాన్‌బేరాలకు సూర్జాసాహు గతి పట్టించాలని వేసుకున్న ప్లాన్ కూడా పక్కన పెట్టేయాలి. ఈ ప్లాను షోమాయ్, బుధ్నాలకు తెలుసు. ఎందుకో దోపది డొక్కల్లో ముంచుకొస్తున్న పెనుముప్పు కదులుతోంది.

షోమాయ్, బుధ్నాల నమ్మకద్రోహం కంటే వొక సంతాల్‌కి సిగ్గుచేటైనది వుందా? దోపదిది అచ్చమైన కల్తీలేని చంపాభూమి నల్లటి నెత్తురు. చంపా నుంచి బకూలి దాకా సవాలక్ష చంద్రుల్ల ఉదయాస్తమయాలు కదా. వాళ్ళ నెత్తురు కల్తీ అయిపోయి వుంటుంది. తన పూర్వీకులను తలచుకుని దోపది గర్వోన్నతితో వుప్పొంగింది. వాళ్ళు తమ స్త్రీల పవిత్రరక్తానికి రక్షగా నిలబడ్డారు కారునలువు కవచాలతో.

షోమాయ్, బుధ్నాలు సంకరజాతిగాళ్ళు. పోరాటానికి కాసిన కుక్కమూతి పిందెలు. షియాండాంగా దగ్గర విడిసిన అమెరికా సైనికులు యీ రాధాభూమికి సమర్పించిన నూడిదలు. లేకపోతేనా, ఒక సంతాల్ ఇంకో సంతాల్‌ను మోసం చేసేలోగా పావురాయే సాటి పావురాయిని చీల్చి తినేయదూ!

ఆమె వెనక దగ్గరవుతున్న అడుగుల చప్పుడు. ఆమె మొలలో అన్నం మూటా, బొడ్లో పొగాకూ. అరిజిత్, మాలిని, శాము, మంటూ – వీళ్ళెవరూ పొగ తాగరు; కనీసం టీ కూడా. పొగాకూ, సున్నం తేలుకాటుకు తిరుగులేని మందు. ఏదీ వదిలెయ్యకూడదు.

దోపది ఎడంవేపు తిరిగింది. ఇది క్యాంపు దారి. రెండు మైళ్ళు. ఇటు ఇక అడివి రాదు. వెనక పోలీసును వుంచుకుని దోపది అడివిలోకి వెళ్ళదు గాక వెళ్ళదు.

నా ప్రాణాల మీద ప్రమాణం. దుల్నా, నా ప్రాణాలమీద ప్రమాణం. ఏదీ పెదవి దాటదు.

వెనక అడుగులు కూడా ఎడంవేపు తిరిగాయి. దోపది నడుం మీద చెయ్యేసింది. ఆమె అరిచేతిలో వొదిగిన చంద్రవంక, వొక లిక్కి కొడవలి. ఝుర్‌ఖానీ కమ్మరోళ్లు యమనపురిజిత్తులు. 'ఉఫ్, దానికి ఎట్టాంటి పదును పెడతామంటే వొక దెబ్బకి వంద దుక్కీరామ్‌లు'... వాళ్ళకు కొడవలీ, చిప్పగొడ్డలీ, బాకూ వొడుపులన్నీ తెలుసు. చడీచప్పుడు లేకుండా చేసేస్తారు.

అల్లంత దూరంలో క్యాంపు దీపాలు కనిపిస్తున్నాయి.

అరె, దోపది అటెందుకు వెళుతోంది? కొంచెం ఆగు, అక్కడ మళ్ళీ మలుపు.

ఓసోస్! కళ్ళు మూసుకుని రాత్రంతా తిరిగినా నేను యెక్కడుండేదీ చెప్పెయ్యగలను. అడివిలోకి వెళ్ళిపోయి నన్ను వెంటాడే వాణ్ణి మాత్రం వదిలేసుకోను. వాడికి అందకుండానూ పరుగెత్తిపోను. ఒరే నక్కజిత్తుల ఖాకీ నా కొడకా, చావు మాటెత్తితే వొణికి చస్తావు. నువ్వు యీ అడివంతా పరుగెత్తలేవు. నిన్ను వూపిరాడకుండా తిప్పి గోతిలోకి తోసి ఖతం చేసేస్తా.

ఒక్క మాట కూడా పెదవి దాటకూడదు.

దోపది ఆ క్యాంపు చూసుకునే వచ్చింది. బస్టాండులో కూర్చుని పగలంతా అక్కడే గడిపింది. బీడీ కాలుస్తూ ఎన్ని పోలీసు దళాలు వొచ్చాయో కనిపెట్టింది. నాలుగు పళ్ళరసాలూ, ఏడు వుల్లిపాయలూ, యాభై మిరపకాయలూ – చక్కని లెక్క.

ఈ సమాచారమంతా యిప్పటిక వాళ్ళకు చేరబోదు. దోపదీ మేఝున్ ఎన్‌కౌంటరయిపోయిందని వాళ్ళు తెలుసుకుంటారు. తక్షణం మాయమవుతారు.

అరిజిత్ మాటలు గింగురుమంటున్నాయి.

"ఒకవేళ ఎవరైనా పట్టుబడిపోయి వుంటే, కలవాల్సిన వేళ నుంచి పోయిందేమో పసిగట్టి స్థావరం మార్చెయ్యాలి. కామ్రేడ్ దోపది ఆలస్యంగా వస్తే మనం వుండం. మన పోబడి చెప్పే గుర్తు ఒకటుంటుంది. ఆమె వొక్క దాని కోసం ఏ కామ్రేడూ ఇతరులను బలికానివ్వడు.'

మళ్ళీ అరిజిత్ గొంతు. నీటి గలగలలాగా. 'తరువాయి స్థావరం వుండే దిక్కు రాతి కింద బాణం ముక్క చెబుతుంది. '

దోపదికి ఇలాంటివి తెలుసుకోవడం బహు ఇష్టం.

దుల్నా చచ్చిపోయాడు, అయితే ఒక విషయం అతడు ఎవరి ప్రాణానికీ ముప్పు రానీయలేదు. ఎందుకంటే ఒకడు తప్పించుకోడానికి యింకొకణ్ణి ఎన్‌కౌంటర్‌లోకి నెట్టే వూహ మన బుర్రల్లోకి రాదు కదా.

ఇప్పుడు మరింత సులువుగా స్పష్టంగా వుండే కఠోరమైన నియమం. దోపది వచ్చిందా – శుభం. రాలేదా – అంతే. స్థావరం మార్చెయ్. సంకేతం ఎలా వుండాలంటే ప్రత్యర్థులకు కనిపించకూడదు. ఒకవేళ కనిపించినా అర్థం కాకూడదు.

ఆమె వెనకాల అడుగుల చప్పుడు. దోపది మళ్ళీ మలుపు తిరిగింది. ఈ మూడున్నర

మైళ్ళ రాళ్ళ నేల అడివి చేరుకోడానికి చక్కని మార్గం. అయితే ఆ మార్గాన్ని దోపది వెనకే వదిలేసింది. ముందు కొంచెం మిట్ట. మళ్ళీ రాళ్ళే. రాతి నెలవులో సైన్యం క్యాంపు దిగడం అసాధ్యం. ఈ ప్రాంతం ఫర్వాలేదు, అంతా చిక్కురు వొక్కురుగా వుంది. ప్రతి గుట్టా యింకోదానిలాగే వుంది. భేష్, దోపది ఆ ఖాకీని వల్లకాటికి తీసుకుపోతుంది. ఈ వల్లకాట్లోనే శరణ్‌దాలో వుండే పతితపావన్‌ను కాళీకి బలి ఇచ్చింది.

పట్టుకో!

వొక రాళ్ళగుట్ట లేచి నిలబడింది. యింకొకటి. మళ్ళీ యింకొకటి. ముదురు సేనానాయక్ వొక్కసారిగా గర్వాతిశయంతో బోర విరుచుకున్నాడు. నీ శత్రువును నువ్వు నాశనం చేయదలచుకుంటే వాళ్ళతో వొక్కటయిపో. అదే అతడు చేసింది. ఆరేళ్ళనాడే అతడు వాళ్ళ ప్రతి కదలికనూ వూహించగలిగేవాడు. ఇప్పుడూ అవే జిత్తులు. అందుకే పొంగిపోయాడు.

తన ముందే దోపది ఆటలు సాగడం పట్ల సేనానాయక్‌కు గుర్రుగా వుంది. దీని క్కూడా రెండు కారణాలు. మెదడు కణాల్లో సమాచార నిక్షిప్తి అని ఆరేళ్ళనాడు అతడొక వ్యాసాన్ని అచ్చేశాడు. వ్యవసాయ కూలీల దృక్పథం నుంచి తాను ఈ పోరాటాన్ని ఎలా సమర్థిస్తున్నదీ ఆ వ్యాసరాజంలో అతడు సవిస్తరంగా నిరూపణ చేసిపారేశాడు. మరి దోపది వ్యవసాయ కూలీ. గడతేరిన పోటరి. గాలించు – నాశనం చెయ్. దోపదీ మేఝన్ ఇప్పుడు పట్టుబడబోతోంది. ఇక నాశనం. పాపం శమించుగాక.

నిలు!

దోపది తటాలున ఆగింది. వెనక నుంచి అడుగులు చుట్టుతిరిగి ముందుకొచ్చినై. దోపది పక్కటెముకల కింద కట్ట తెగింది. ఇక ఆశ లేనట్టే.

సూర్జా సాహు తమ్ముడు రొటోని సాహు. మరో రెండు రాళ్ళ గుట్టలు ముందుకొచ్చినై. ఒకడు షోమాయ్! ఇంకొకడు బుధ్నా!!

వాళ్ళు రైలెక్కనూ లేదు, పారిపోనూ లేదు.

అరిజిత్ కంఠధ్వని. విజయం తర్వాత ఉత్సవం యెలాగో అపజయం తర్వాత కూడా చేయాల్సిన కార్యక్రమాలు కొన్ని వుంటాయి.

అడివి వైపు మళ్ళి, రెండు చేతులూ చాచి, ఆకాశం కేసి చూసి తన యావచ్ఛక్తితోనూ వూళ వేసింది దోపది. వొకటి, రెండు, మూడు. మూడో వూళకి అడవి శివార్లలో చెట్ల మీద పిట్టలు లేచి టపటపా రెక్కలు కొట్టుకున్నయ్. ఆ ప్రతిధ్వని బహుదూరం ప్రయాణిస్తుంది.

** ** **

సాయంకాలం 6–53కి ద్రౌపదిమేఝన్ దొరికిపోయింది. క్యాంపుకి తీసుకెళ్ళేసరికి గంట. ప్రశ్నలు యింకో గంట. ఆమెను యెవరూ తాకలేదు. కాన్వాసు క్యాంపు స్టూలు మీద కూర్చోనిచ్చారు. 8–57. సేనానాయక్ భోజనానికి కూర్చోవాలన్నమాట. 'దాన్నో చూపు చూడండి' అని ఆర్డరేసి అదే పోవడం.

అమాంతంగా శతకోటి చంద్రగోళాలు తిరిగిపోయాయి. శతకోటి చాంద్రమాన సంవత్సరాలు తిరిగిపోయాయి. పది లక్షల కాంతి సంవత్సరాల అనంతరం కళ్ళు తెరిచిన ద్రౌపది నిస్త్రాణగా వొక రకమైన ఆకాశాన్నీ అదోమాదిరిగా వున్న చంద్రుణ్ణీ చూడగలిగింది. మెదడులో దిగబడిన నెత్తుటి మేకులు నెమ్మదిగా తొలగుతున్నాయి. కదలడానికి అవస్థపడుతుంటే ఆమె కాళ్ళూ చేతులూ యింకా నాలుగు గుంజలకి కట్టేసినట్టే వుంది. మొలకిందా పిర్రల కిందా జిగటగా వుంది. అది ఆమె నెత్తురు. నోట్లో కుక్కిన గుడ్డ మాత్రం తీసేశారంతే.

ప్రాణాలు ఆరిపోయే దాహం.

దాహం– అని పొరబాటున అనేస్తానేమోనని కింద పెదవిని మునిపంట పట్టుకుంది. యోని నెత్తురోడుతున్నట్టు తెలుస్తోంది. ఎందరు పడ్డారు ఆమె మీద?

ఆమెను సిగ్గుపడేటట్టుచేస్తూ కనుకొలకుల నుంచి వొక కన్నీటి బొట్టు రాలిపడింది. ఆ గుడ్డి వెన్నెట్లో ఆమె వెలుగులేని కన్నులను వాల్చి చూసింది. రొమ్ములకేసి చూసింది. పచ్చిగా కొరికేశారు. చనుమొనలు చీలికలైపోయాయి. తనను నిలువునా చెరిచారు. ఎంత మంది? నలుగురు – అయిదుగురు–ఆరుగురు–యేడుగురు – ఆ తర్వాత ద్రౌపది స్పృహ తప్పిపోయింది.

ఆమె కళ్ళు మెల్లగా తెరుకుని యేదో తెల్లటి దాన్ని చూశాయి. అది ఆమె వొంటి మీది గుడ్డే, యింకేం కాదు. ఆశకు తావే లేని క్షణం ఆమెలో వొక ఆశ తళుకుమంది. నక్కలకు ఫలారంగా తనను వొదిలి పారేశారేమో! కానీ అడుగుల కిరకిరలు ఆమె చెవినిబడ్డాయి. ఒక గార్డు ఆమెవైపే ఆబగా చూస్తున్నాడు బయొనెట్‌ను ఆనుకుని. ఆమె కళ్ళు మూతలు పడిపోయాయి. ఆమెకిక గడువు లేకపోయింది. మళ్ళీ ఆమెమీద పడ్డారు.

తెల్లవారింది.

టెంట్ దగ్గరికి లాక్కొచ్చి గడ్డిలో పడేశారు ద్రౌపదీ మేఝన్‌ని.

ఆమె గుడ్డ పేలికనే వొంటి మీద విసిరారు.

సేనానాయక్ అల్పాహారం తర్వాత

తీరిగ్గా పేపరు చూసిన తర్వాత

ద్రౌపదీ మేఝన్ పట్టుబడెను.... తోక తొంభై.. వగైరా రేడియో మెసేజీలు పంపిన తర్వాత – ద్రౌపదీ మేఝన్‌ను లోపలికి తీసుకు రావడానికి ఫర్మానా అయింది.

అయితే అనుకోని చిక్కొకటి వొచ్చి పడింది.

లెయ్! అని ద్రౌపదిని గదిమారో లేదో – ఆమె వెంటనే లేచి కూర్చొని 'యెక్కడికి?' అని అడిగింది.

– బుర్రా సాహిబ్ టెంట్‌కి.

– యెక్కడది?

– అదే

ద్రౌపది యెర్రబడిన చూపులు ఆ టెంట్‌కు గుచ్చుకు పోయాయి.

–వెళ్తా!రా

నీటిముంతను గార్డు ఆమె ముందుకు నెట్టాడు.

ద్రౌపది లేచి నిలబడి ఆ కడవ నీళ్ళను నేల మీద దిమ్మరించింది. వొంటిమీది గుడ్డపేలికని నోటితో చీలికలు పేలికలు చేసేసింది. ఈ వైనం చూడగానే 'దీనికి పచ్చి పట్టేసింది' అని గార్డు కాళ్ళకు బుద్ధి చెప్పాడు. మామూలు ఖైదీని వెంట తీసుకు పోవడం చేతనవును గానీ యిలాంటి ఖైదీని యేం చేయాలో వాడికి తెలీదు. పైవాణ్ణి అడగడానికి పరారయ్యాడు.

జైల్లో అలారం మోగినంత కల్లోలం పుట్టింది.

సేనానాయక్ బయటికి వచ్చి – ఆ పట్టపగలు, మొల మీద నూలుపోగు లేకుండా తలనిగిడ్చి తనవైపే వస్తున్న ద్రౌపదిని చూసి బిత్తరపోయాడు. బిక్కచచ్చిన గార్డులు నక్కి నక్కి నడుస్తున్నారు.

"ఏమిటిదంతా?" అని అతను అరవబోయి ఆగిపోయాడు.

అతడి ఎట్టయెదుట ద్రౌపది నగ్నంగా నిలబడింది. తొడలూ, పొత్తికడుపుకింది వెంట్రుకలూ నెత్తుటితో అట్టలు గట్టుకు పోయాయి. రెండు రొమ్ములూ రెండు పుండ్లు.

"ఏమిటిది?" అని అతను మొరగబోయాడు.

ద్రౌపది మరింత దగ్గర కొచ్చింది. నడుం మీద చెయ్యి ఆన్చి నిలబడి భగభగ నవ్వుతూ అంది– 'ఇదుగో నువ్వు వేటాడుతున్న మెకం,దోపదీ మేఝన్. నన్నో చూపు చూడమని నువ్వు ఆ మృగాలను కోరావ్. మరి వాళ్ళు నన్ను ఎలా చూశారో నువ్వు చూడాలనుకోవడం లేదా!?"

–ఆమె బట్టలేవిరా?

– తగలనివ్వడం లేదు సార్. చింపుతా వుంది.

ద్రౌపది నల్లటి వొళ్ళు యింకా కొంచెం దగ్గరికొచ్చింది. ఆమె యెలాంటి వికటాట్టహాసంతో వూగిపోతూందంటే అసలు సేనానాయక్‌కు దిక్కు తెలీకుండా పోయింది. ఆమె నవ్వుతూంటే, పగిలిన పెదాలు నెత్తురు చిమ్ముతున్నాయి. ఆ నెత్తుటిని అరిచేత్తో తుడుచుకుని తన వూళంత వాడిగా, భీకరంగా ఆకాశం అదిరేటట్టు యెలుగెత్తింది.

'గుడ్డలతో యేం పనిరా? నా గుడ్డలు వూడదీస్తావుగానీ కట్టడం వచ్చా? నువ్వు మనిషివా?'

ఆమె చుట్టూ చూసి సేనానాయక్ తెల్లటి బుష్‌షర్టు మీద నెత్తుటి వుక్కిటిని ఖాండ్రించి వూసింది.

'నేను సిగ్గు పడడానికి యిక్కడ మగాడెవడూ లేడు. నా వొంటి మీద మిమ్మల్ని మళ్ళీ గుడ్డ కప్పనియ్యను. ఇంతకంటే ఏం చేస్తావ్‌రా? రా నన్ను ఎన్‌కౌంటర్ చెయ్యి, రారా నన్ను ఎన్‌కౌంటర్ చెయ్యి?'

చీలికలయిన రొమ్ములతో ద్రౌపది తనను నెట్టుకు వస్తుంటే ఎలాంటి ఆయుధాలూ లేని ప్రత్యర్థి ముందు నిలబడ్డానికి సేనానాయక్ మొట్టమొదటిసారి భయపడ్డాడు. విపరీతంగా భయపడ్డాడు. ■